క్లుప్తంగా

బాలల హక్కులను పరిరక్షిద్దాం



కేటీదొడ్డి: బాలల హక్కుల పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని బాలల హక్కుల సంరక్షణ కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఎర్సం దొడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక వేధింపులు, బాలల సంరక్షణ, విద్యాహక్కు చట్టం తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్ నాయక్, సర్పంచు గోపాల్, హెచ్ఎం మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అడివేశ్వర స్వామి జాతర



రాజోళి: మండల కేంద్రంలో వెలసిన భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతర ప్రతి ఏడాది శివరాత్రి నుంచి ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి ఇతర పనుల్లో నిమగ్నమయ్యారు. మొదటి రోజు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణం తిలకించేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతర ఆవరణలో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. స్వామి వారి రథానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. జాతరలో పశువులు, వ్యవసాయ పనిముట్లు, ఎడ్లబండ్లు కొనుగోలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు తరలివస్తారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కేటీదొడ్డి: ఓ మహిళ ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం బృందం నర్మద, జిల్లా కార్యదర్శి అంజనమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని ఉమిత్యాల తండా గ్రామానికి చెందిన సంధ్య కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు లైంగిక వేధుపుల కారణంగా సంధ్య ఆత్మహత్యకు పాల్పడిందని, నిందితులను కాపాడేందుకు పోలీసులు, నాయకులు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. పోలీసులు సమగ్రమైన విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన ముగ్గురు పిల్లలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీసీ రోడ్లు, నర్సరీల నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రోడ్లను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన



శాంతినగర్: ఐకమత్యంతోనే హక్కులు సాధించుకోవచ్చని మాదారి, మదాసి కురువ సంఘం నాయకుడు పల్లయ్య అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో ఆ సంఘం భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సర్టిఫికెట్లు, హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసోమన్న, మల్లికార్జున్, పీకే రామాంజనేయులు, రంగస్వామి, వెంకటేశ్వర్లు, అడివప్ప, కృష్ణ, మద్దిలేటి, బ్రహ్మం, తిక్కయ్య, రవికుమార్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. దైన్యం



బిజ్వారంలో డాక్టర్ లేకపోవడంతో పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

- వైద్యులు లేక మూగజీవాలు విలవిల
- మూతపడుతున్న పశువైద్య కేంద్రాలు

మల్దకల్: పశు సంపదను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలకే ప్రభుత్వం పరిమితం అయ్యింది. క్షేత్రస్థాయిలో పశువైద్యం అందక మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. సీజనల్ వ్యాధులు సోకకుండా అప్పుడప్పుడు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. పశువుల ఆరోగ్యంపై సరైన అవగాహన లేక రైతులు సతమతమవుతున్నా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదు. పశువైద్య కేంద్రాలు నిర్మించినా వైద్యుల నియామకం లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మూగజీవాలకు వైద్యం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యం చేయనప్పుడు పశువైద్య కేంద్రాలు ఎందుకు అని పశువుల కాపరులు ప్రశ్నిస్తున్నారు.

19 మంది వైద్యులకు ఆరుగురే!

జోగులాంబ గద్వాల జిల్లాలో పశు వైద్యులు లేక మూగజీవాలకు వైద్యం అందక గొర్రెల కాపరులు పశువుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 12 మండలాలలోని పశువైద్య కేంద్రాలకు 19 డాక్టర్లు ఉండాల్సి ఉండగా 6 మంది మాత్రమే ఉన్నారు. దీంతో సిబ్బంది లేక పశు వైద్య కేంద్రాలు మూతపడ్డాయి. మండలంలో రెండు పశువైద్య కేంద్రాలతో పాటు ఆరు పశువైద్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వాటికి మొత్తం 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 6 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మల్దకల్ పశువైద్య కేంద్రానికి డాక్టర్ వినయ్‌కుమార్ కేటీదొడ్డి మండల పశువైద్య కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. అలాగే పాల్వాయిలో పనిచేస్తున్న డాక్టర్ యామినిసాయి గద్వాల జిల్లా కేంద్రంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తుడంతో పాల్వాయి పశువైద్య కేంద్రానికి సైతం డాక్టర్ లేక మూతపడింది. ఉన్న సిబ్బంది కూడా సక్రమంగా తమ విధులకు రాకపోవడంతో గొర్రెల కాపరులు పాడి పశువుల రైతులు ప్రతిరోజు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వేలరూపాయల ఖర్చులు పెట్టుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా బిజ్వారం, విఠలాపురం, మద్దెలబండ గ్రామాలలోని పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 25,628వేల గొర్రెలు, 15,136 పశువులు ఉన్నాయి. వాటిలో పశువులకు ఏడాదికి రెండు సార్లు గొర్రెలకు ఏడాదికి మూడుసార్లు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. పశువైద్య సిబ్బంది కొరతతో మూగజీవాలకు సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల్వాయిలో రూ.25 లక్షల వ్యయంతో నూతన బిల్డింగ్ నిర్మించిన డాక్టర్ లేకపోవడంతో మూతపడింది. ఈవిషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని గొర్రెల కాపరులు రైతులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మూగజీవాలకు వైద్యం అదేవిధంగా వైద్య సిబ్బందిని నియమించి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పాల్వాయిలో డాక్టర్ లేక మూతపడిన పశువైద్య కేంద్రం

డాక్టర్లను నియమించాలి



పాల్వాయి గ్రామంలోని పశువైద్య కేంద్రానికి డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రూ.25 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించిన డాక్టర్లు లేకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా డాక్టర్‌ని నియమించి సమస్యను పరిష్కరించాలి. – ఈదన్న, పాల్వాయి

అధికారులు చర్యలు తీసుకోవాలి



మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న పశు వైద్య ఉప కేంద్రాలకు సిబ్బంది లేరు. గొర్రెల కాపరులు, పశువుల యాజమానులు ఇబ్బందిగా ఉంది. పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. వైద్య సిబ్బంది భయందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలి. – గోవింద్, బిజ్వారం

సమస్యలు పరిష్కరిస్తాం

మండలంలోని వివిధ గ్రామాలలో పశు వైద్య సిబ్బంది కొరత వాస్తవమే. గొర్రెల కాపరులు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి ఉన్నతాధికారుల వివరిస్తాం. – పి వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్య అధికారి

పోటాపోటీగా వృషభరాజాల బల ప్రదర్శన



బండలాగు పోటీల్లో తలపడుతున్న సేద్యపుటెద్దుల విభాగం వృషభరాజాలు

అయిజ: పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర వృషభరాజాలు బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గురువారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 12 జతల వృషభరాజాలు బల ప్రదర్శన పోటీల్లో పాల్గొన్నాయి. రాయచూరు జిల్లా పల్కమ్‌దొడ్డికి చెందిన ఖాజా ఉసేని ఎద్దులు 20 నిమిషాల్లో 5,700 అడుగుల దూరాన్ని బండను లాగి ప్రథమ బహుమతి రూ. 40,016 కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా యాదిరెడ్డి పల్లికి చెందిన డాక్టర్ అఖిలేష్ రెడ్డి ఎద్దులు 5,309 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతి రూ. 35,016 గెలుచుకున్నాయి. నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మన్న ఎద్దులు 5,153.9 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ. 30,016 సాధించాయి. నంద్యాల జిల్లాకు చెందిన శివకోటి, నడపలన్న ఎద్దులు 5,103 దూరాన్ని లాగి నాల్గో బహుమతి రూ. 15,016 గెలుపొందాయి. నంద్యాల జిల్లా, పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన ఖనల్లా గ్రామానికి చెందిన గుడం చెన్నారెడ్డి ఎద్దులు 5,018 అడుగుల దూరాన్ని లాగి ఐదవ బహుమతి రూ.10,016 కైవసం చేసుకున్నాయి. ఉత్తమ రథసారధిగా రేపల్లికి చెందిన జమ్మన్న ఎంపికయ్యారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గురువును దర్శించుకున్న ఎమ్మెల్యే



కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలో ఆధ్యాత్మిక గురువు గణేకల్ శ్రీజ్ఞాన ప్రకాశ మహంత శివయోగిని గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దర్శించుకున్నారు. అంతకుముందు గురువును శాలువాతో సన్మానించి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, సర్పంచు మహాదేవి, నాయకులు చక్రధర్, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకుందాం



అయిజ: పశు సంపదను కాపాడుకుందామని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూప రాణి కోరారు. గురువారం మండలంలోని భూంపురంలో పశువులకు ఫర్టిలిటీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 15 పశువులకు వివిధ వ్యాధుల పరీక్షలు చేశారు. పశువుల్లో కృత్రిమ గర్భాధారణ వలన మేలు రకం జాతి పశువుల సంతాన ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గద్వాల న్యూటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన తపస్ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని ఆదరించాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. గురువారం అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉపాధ్యాయ సమస్యలపై ఏవీఎన్ రెడ్డికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, మెడికల్ తిరుమల్‌రెడ్డి, కేకే రెడ్డి, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తపస్ ఉపాధ్యాయ సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని బిజ్వారం, అమరవాయి పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఆయన కలుసుకొని మొదటి ప్రాధాన్యత ఓటు వేయలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు, రవీందర్‌రెడ్డి, నరేష్, మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్, రవి, సుంకన్న, భాస్కర్, మధు, తిమ్మప్ప, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

పాఠశాలకు వస్తువుల వితరణ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి అర్బన్ గురుకుల పాఠశాలకు పలు వస్తువులను ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన యూట్యూబ్ స్టార్ టెక్నికల్ ఎర్న్ రాజు వితరణ చేశారు. రూ. 20వేల వ్యయంతో ఫ్యాన్లు, కుర్చీలు, స్టేషనరీ, క్రీడా సామగ్రిని గురువారం పాఠశాల సిబ్బందికి ఆయన అందజేశారు. అనంతరం దాత రాజును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి శేషన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మారంపల్లి లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఆదరించాలని అభ్యర్థి ఉపాధ్యాయులను వేడుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, హనుమంతు, బంగారం, యాదయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి జమ్మిచెడ్ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని హమాలీ కాలనీకి చెందిన పరుశరాముడు, పరుశలు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై బయటకు వచ్చారు. పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా జమ్మిచెడ్ శివారులో బొలెరా వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బొలెరో వాహనం తగిలి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరుశరాముడు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

వృద్ధుడికి రిమాండ్

ఉండవెల్లి: ఈ నెల 12న బాలికతో వివిధ అసభ్య సైగలను చూపిస్తూ ఇబ్బందిపెట్టిన వృద్ధుడు జగన్నాదంను గురువారం పోలీసులు పట్టుకొని అలంపూర్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి కవిత 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



విఠలాపురం గ్రామస్తులతో పటేల్ ప్రభాకర్‌రెడ్డి

మల్దకల్: ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మల్లెందొడ్డి, విఠలాపురం, చిప్పదొడ్డి గ్రామాలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్, నారాయణరెడ్డి, గౌస్, షేక్‌జమాల్, వెంకటరెడ్డి, వెంకటేష్, దాసన్న, మాజీద్, వెంకటన్న, దేవన్న, మల్లప్ప, బుచ్చిరెడ్డి, ఇలియాస్, రాజేంద్ర, రవినాయుడు, కోటేష్‌గౌడు, హాజీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు విశేష స్పందన



ర్యాలంపాడులో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



అలంపూర్‌లో కంటి వైద్య శిబిరం

వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ధరూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం గురువారం మండలంలోని ర్యాలంపాడులో కంటి వెలుగును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కర్రెమ్మ, ఉప సర్పంచు చిట్టెం వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వసంత్, పురుషోత్తంరెడ్డి, దౌలన్న, అంపన్న, చిన్న నర్సింహులు గౌడ్, పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 70 మంది పురుషులు, 87 మంది మహిళలు మొత్తం 157 మంది, క్యాతూర్ పీహెచ్‌సీలోని లింగన్‌వాయిలో 75 మంది పురుషులు, 70 మంది మహిళలు మొత్తం145 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూణ రాణి, డాక్టర్ రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్ఏ బాలీశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని గంగిమాన్ దొడ్డి, మిట్టదొడ్డి గ్రామాలలో గురువారం నిర్వహించిన కంటి వెలుగులో 272 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు తిమ్మప్ప, నరేష్, వైద్య సిబ్బంది హుసేన్, మక్బుద్, వెంకటాద్రి నాయుడు, పార్వతి, స్వర్ణలత, విఘ్నేశ్వరీ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొరల పాలనను సాగనంపుదాం

మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



అలంపూర్ మండలంలో స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

అలంపూర్/అలంపూర్ రూరల్: రాష్ట్రంలో దొరల పాలనను సాగనంపుదామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కోరారు. గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని ఉట్కూరు, భీమవరం, క్యాతూర్, లింగనవాయి గ్రామాల్లో ఆయన పాదయాత్ర కొనసాగింది. ప్రజలతో మమేకమవుతూ చేయి చేయి కలుపుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల్లోని మహిళలు పలు సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సంపత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ ఉచిత హామీలు ఇస్తూ మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కరెంట్, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల భారీగా పెరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అలంపూర్‌లో అవినీతి, కమీషన్, అక్రమ ఇసుక, మద్యం దందాలతో అధికార పార్టీ నాయకులు ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. నిరంకుశ పాలనలతో విసిగిన ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర



నందిన్నె నుంచి శ్రీశైలానికి బయలు దేరిన శివస్వాములు



రాజోళిలో ఇరుముడితో బయలుదేరుతున్న శివమాలధారులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె నుంచి శివమాలధారులు గురువారం పాదయాత్రగా శ్రీశైలానికి బయలు దేరారు. అంతకు ముందు గ్రామంలోని ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నందిన్నె ప్రకాష్ శివస్వాముల నుంచి ఆశీర్వాదం తీసుకొని పండ్లను అందజేశారు. అనంతరం శివ మాలధారుల కుటుంబసభ్యులు సాగనంపారు.

రాజోళి: మండలంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో శివమాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి బయలుదేరారు. 40 మంది శివస్వాములకు స్థానికులు శివ కీర్తనలు, భజనలతో వారిని సాగనంపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాల గ్రామానికి చెందిన మధు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు ప్రభుదాస్, మధు, బీసన్న, పల్లవి, సురేష్, అనిల్, తదితరులు ఉన్నారు.

వరి పంటల పరిశీలన

పెబ్బేరు: మండలంలోని రామమ్మపేట శివారులో సాగు చేసిన వరి పంటలను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రమౌళి మాట్లాడుతూ యాసంగిలో వరి పంటలో తెగుళ్లు ఆశిస్తున్నాయని తెలిపారు. రైతులు తెగుళ్లపై పలు జాగత్తలు తీసుకోవాలని, అలాగే వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువ ఉందని పేర్కొన్నారు. వీటి నివారణకు ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్, జింకు లోప నివారణ ఎకరాకు 250 గ్రాముల చీలమిన్ జింకు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

మంత్రికి ఆహ్వానం

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండల కేంద్రంలో మార్చి 7న నిర్వహించే రంగనాయకస్వామి జాతరకు రావాలని గురువారం శ్రీరంగాపురం సేవా సమితి ఆధ్వర్యంలో హైదారాబాద్ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా శ్రీరంగాపురం సేవా సమితికి స్థలం కేటాయించాలని మంత్రిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రఘునందన్‌రావు, ఉపాధ్యక్షులు నరేందర్, కార్యదర్శి నగేష్ బాబు, కోశాధికారి జగదీశ్వర్‌గౌడ్, గోపాల్, రాజు, రఘు, సుకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.